https://vijayamdaily.com

# విజయం

అక్షర సమరానికి నాంది..

ఖమ్మం | భద్రాద్రి | కొత్తగూడెం

పేజీలు : 12 | మంగళవారం అక్టోబర్ 17-2023 | https://vijayamdaily.com





# పాలేరుకు పొంగులేటి

# ఖమ్మంకు 'తుమ్మల'



## కొత్తగూడెంకు కూనంనేని.. పినపాకకు పాయం

## ఇల్లందుకు కోరం.. వైరాకు రాందాస్..?

- ఖరారైన సీట్ల సర్దుబాటు..?
- రేపు రెండవ జాబితా విడుదల చేయనున్న అధిష్టానం
- సాయంత్రం 4గంటలకు ముహూర్తం
- పెండింగ్ లో సత్తుపల్లి, అశ్వరరావుపేట
- సంభాని, సుధాకర్, రాఘుమయి మధ్య హోరాహోరీ
- ఖమ్మంలో ఆసక్తికరంగా మారుతున్న రాజకీయాలు







వివరాలు 2లో..

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితా సిద్దమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే మొదటి జాబితాను విడుదల చేసిన కాంగ్రెస్ అధిష్టానం, రెండవ జాబితాను విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఖమ్మం జిల్లాలో కూడా మరో ఐదు స్థానాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తి చేసేందుకు కసరత్తు పూర్తి అయినట్లు తెలుస్తోంది.. అందుకు గాను ఈనెల 18న సాయంత్రం 4గంటలకు సుముహూర్తానా రెండవ జాబితాను విడుదల చేసే అవకాశం ఉంది.. కాగా అభ్యర్థుల ప్రకటనపై యావత్తు రాష్ట్రం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.. ఖమ్మం జిల్లాలో అభ్యర్థుల ఎంపికపై విజయం పత్రిక అందించే పొలిటికల్ స్టోరీ..

## కుంజా సత్యవతి ఇకలేరు

భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి హఠాన్మరణం

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన తుమ్మల, పోడెం వీరయ్య

సంతాపం తెలిపిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఈటెల, బీజేపీ నాయకులు



భద్రాచలం, అక్టోబర్ 16 (విజయం న్యూస్):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి కుంజ సత్యవతి ఆదివారం అర్ధరాత్రి బిపి లెవెల్స్ పడిపోయి అస్వస్థకు గురైయ్యారు. ఆమెను భద్రాచలం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించేందుకు ప్రయత్నం చేయగా, మార్గం మధ్యలోనే ఆమె చనిపోయినట్లు స్థానికులు తెలిపారు. సీపీఎం పార్టీ ద్వారా కుంజా సత్యవతి తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలు పెట్టారు. 1991లో ఆ పార్టీ ద్వారా ఎంపీపీగా ఎన్నికయ్యారు. 3లో..



## దమ్ముంటే ఇప్పుడు రాండీ..

# తేల్చుకుందాం..

- నేను లేనప్పుడు గజదొంగల వలే ఖమ్మంలో దూరారు..
- నేను ఇప్పుడు వచ్చా.. రండీ..
- ఒక్కరిద్దర్ని చేర్చుకోగానే హీరోలైపోయారా..?
- నాతో పెట్టుకుని ఒక్కసారి ఓడినవ్..మళ్లీ ఓడిస్తా
- చివరకు ఓడేది కాంగ్రెస్...గెలిచేది బీఆర్ఎస్
- తుమ్మలపై మండిపడిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్
- నా పేరు ప్రస్తావిస్తే చెప్పుతో కొడతా: మేయర్ 2లో..

## భద్రాద్రి గులాబీ పోరులో

# తెల్లం నెగ్గేనా..?

- లీడర్ చేతిలో కారు స్టీరింగ్
- నియోజకవర్గంలో దూరమైన బాలసాని కేడర్
- వర్గ పోరులో అగ్రవర్ణానిదే పై చేయి
- కేడర్ లేని లీడర్లతో తెల్లం నెగ్గేనా..?



(భద్రాచలం/ నూగురు వెంకటాపురం- విజయం న్యూస్)

భద్రాచలం రేసులో గులాబీ దళం నిలుస్తుందా..? పార్టీ మారి తిరిగి వచ్చిన నేత కారుపార్టీలో గెలుస్తారా..? ప్రజలు ఆదరిస్తారా..? గిరిజన రిజర్వేషన్ కల్గిన భద్రాచల నియోజకవర్గంలో ఆగ్రకుల అధిపత్యం పెరిగిందా..?ఆ కారణంగానే బలమైన బీసీ సామాజిక వేత్త పార్టీని వీడారా..? జిల్లా కానీ జిల్లాలో నాయకత్వం వహిస్తూ గిరిజనులపై పెత్తనం చెలాయిస్తున్న ఆ నేతపై బీఆర్ఎస్ నేతలు 7లో..

# పాలేరుకు 'పొంగులేటి'.. ఖమ్మంకు 'తుమ్మల'

(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థుల ఎంపిక రోజుకో మలుపు తిరుగుతున్నట్లే కనిపిస్తోంది.. మొదటి జాబితాలోనే సంచలన నిర్ణయాలు తీసుకున్న కాంగ్రెస్ అధిష్టానం రెండవ జాబితాలో మరిన్ని సంచలన నిర్ణయాలు ఉండే విధంగా కసరత్తు చేస్తోంది.. అతి కొద్ది రోజుల క్రితమే తొలి జాబితాను విడుదల చేసిన కాంగ్రెస్ అధిష్టానం రెండవ జాబితాను విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.. రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలకు గాను 55 నియోజకవర్గాలకు మొదటి జాబితాలో స్థానం కల్పించిన ఏఐసీసీ, ఆ తరువాత మరో 40 స్థానాలను ప్రకటించేందుకు కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది.. అందులో భాగంగానే ఖమ్మం జిల్లాకు సంబంధించిన ఐదు స్థానాలను కూడా కసరత్తూ పూర్తి చేసి అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.. ఆ ఐదు స్థానాలు ఎక్కడ..? ఎవరెవరికి టికెట్లను కేటాయిస్తున్నారనే విషయంపై పూర్తి వివరాల్లోకి వెళ్తాం.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి.. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించగా, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల ప్రకటన మాత్రం అశావాహులను కలవర పెడుతుందనే చెప్పాలి.. నువ్వా..నేనా అన్నట్లుగా సాగుతున్న అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో రోజుకో మలుపు తిరుగుతూ రాజకీయ విశ్లేషకులకే అందనంత విధంగా రాజకీయ సమీకరణాలు మారిపోతున్నాయి.. రాష్ట్ర వ్యాప్తంగా ఒక విధమైన పరిస్థితి ఉంటే.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మరో రకంగా రాజకీయ సమీకరణాలు మారిపోతున్నాయి.. గత కొద్ది నెలల క్రితం కాంగ్రెస్ పార్టే లేదనుకున్న ప్రజలకు, తుమ్మల, పొంగులేటి చేరికతో బలపడిగా, ఇప్పటి వరకు ఒంటరిగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి కమ్యూనిస్టుల అండ దొరకడంతో రాజకీయ సమీకరణాల్లో పెనుమార్పులు ఏర్పడ్డాయి.. అయితే సీట్ల సర్దుబాటు విషయంలో పార్టీ అధిష్టానానికి తలకుమించిన భారంగా మారింది.. అయినప్పటికి చాలా నేర్పుగా, ఓర్పుగా సీట్లను సర్దుబాటు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ అత్యంత తెలివిగా రాజకీయాలను మలుపుతిప్పుతుందనడంలో సందేహమే లేదు.

### ఖమ్మంకు తుమ్మల...పాలేరుకు పొంగులేటి

ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు టిక్కెట్ల కేటాయింపు విషయంలో కొలిక్కివచ్చినట్లే కనిపిస్తోంది.. పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల విషయంలో తర్జనభర్జన పడుతున్న కాంగ్రెస్ అధిష్టానం ఇద్దరు నేతలను ఢిల్లీకి పిలిపించుకుని ఏఐసీసీ అగ్రనేత నేరుగా రంగంలోకి దిగి చర్చలు జరిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏ నియోజకవర్గంలో టిక్కెట్ ఇచ్చిన పోటీ చేసేందుకు సిద్దంగా ఉన్నానని, అదిష్టాన నిర్ణయమే నా నిర్ణయమని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాహుల్ గాంధీతో చెప్పగా, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాత్రం కొత్తగూడెం కానీ, పాలేరు కానీ కేటాయించాలని, అలాగే రాహుల్ జీ మీ ఇష్టమే నా ఇష్టమని చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ప్రస్తుత రాజకీయ సమీకరణాలు, సర్వే రిపోర్ట్, సామాజిక సమీకరణాలను బేస్ చేసుకున్న రాహుల్ గాంధీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పాలేరు నియోజకవర్గాన్ని, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఖమ్మం నియోజకవర్గాన్ని కేటాయించారు. దీంతో ఈ రెండు స్థానాలకు సీట్లు ఖరారైనట్లే..

### కొత్తగూడెం నుంచి కూనంనేని పోటీ

కొత్తగూడెం నియోజకవర్గాన్ని సీపీఐ పార్టీకి కేటాయించినట్లు విశ్వసనీయ సమాచారం. పొత్తుల్లో భాగంగా సీపీఐ పార్టీకి కొత్తగూడెం, చెన్నూరు నియోజకవర్గాలను కేటాయించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ వేణుగోపాల్ స్వయంగా సీపీఐ జాతీయ కార్యదర్శి రాజాకు ఫోన్ చేసిన చెప్పారు. దీంతో సీపీఐ పార్టీ కూడా అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో సీపీఐ పార్టీ నుంచి కొత్తగూడెం నియోజకవర్గానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బరిలో నిలవనున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఆ పార్టీ కొత్తగూడెంలో పార్టీ ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది.

### పినపాక పాయం.. వైరా రాందాసు..ఇల్లందు కోరంకు..?

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎస్టీ నియోజకవర్గాలైన పినపాక, వైరా, ఇల్లందు, అశ్వరరావుపేట నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఎంపిక చేయడం కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, స్క్రీనింగ్ కమిటీ తలకు మించిన భారంగా మారిపోయిందనే చెప్పాలి. వైరా నియోజకవర్గానికి మొత్తం 15 మంది దరఖాస్తులు చేసుకోగా, అందులో ఆ నలుగురి నడుమ పోరు నడుస్తోంది. మాలోతు రాందాసు నాయక్, బానోతు బాలాజీ నాయక్, ధరావత్ రామూర్తి నాయక్, బానోతు విజయబాయి నడుమ పోటీ నెలకొంది. ఇందులో ఎవర్ని ఎంపిక చేయాలన్న సెలకర్టలకు తలనొప్పిగా మారింది. అలాగే పినపాక నుంచి 17 మంది దరఖాస్తులు చేసుకోగా, అందులో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, దనసరి సూర్య, బట్టా విజయ్ గాంధీ, పాలేబోయిన శ్రీవాణి నడుమ పోటీ నెలకొంది. అలాగే ఇల్లందు నియోజకవర్గానికి 32 దరఖాస్తులు రాగా ప్రధానంగా ముగ్గురు మధ్య పోరు ఉన్నట్లుగా తెలుస్తోంది. అయితే ఇందులో అభ్యర్థుల ఎంపిక పై తీవ్ర కసరత్తు చేసిన అనంతరం రాహుల్ గాంధీకి అప్పగించగా, ఆయన మూడు నియోజకవర్గాలకు మూడు పేర్లను ఖరారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇల్లందుకు కోరం కనకయ్య, పినపాకకు పాయం వెంకటేశ్వర్లు, వైరాకు రాందాసు నాయక్ ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.. ఈ పేర్లు దాదాపుగా ఖరారైనట్లుగా సమాచారం.

### 18న రెండవ జాబితాలో ఖరారు

ఈ నెల 15న తొలిజాబితాను విడుదల చేసిన ఏఐసీసీ అధిష్టానం, రెండవ జాబితాను ఈనెల 18న విడుదల చేసే అవకాశం ఉంది. సాయంత్రం 4గంటలకు ఈ ప్రకటన చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం 40నుంచి 42 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అందులో ఖమ్మం జిల్లా నుంచి ఐదు అసెంబ్లీ స్థానాలకు పేర్లు ఖరారైనట్లు సమాచారం. ఆ పేర్లను రెండవ జాబితాలో విడుదల చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

### పెండింగ్ లో సత్తుపల్లి, అశ్వరరావుపేట

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అత్యంత కీలకంగా మారిన నియోజకవర్గాలు సత్తుపల్లి, ఆశ్వరరావుపేట. ఈ రెండు నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థులు రేసులో ఉండటంతో ఎవర్ని తొలగించాలనే విషయంపై ఏఐసీసీ, స్క్రీనింగ్ కమిటీ తర్జన భర్జన పడుతున్నారు. సత్తుపల్లిలో 10 మంది దరఖాస్తులు చేసుకోగా, అందులో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మట్టాదయానంద్, మట్టా రాఘమయి, మానవతరాయ్, కొండూరి సుధాకర్ రేసులో ఉన్నారు. సంభాని చంద్రశేఖర్ కు భట్టి విక్రమార్క మద్దతు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇక్కడ పొంగులేటి, రేణుక చౌదరిల మధ్య తీవ్రమైన పోరు నడుస్తోంది.. మట్టా రాఘమయి కి మహిళకు ఇవ్వాలని రేణుక ప్రయత్నం చేస్తుంటే, సుధాకర్ రెడ్డికి ఇవ్వాలని పొంగులేటి ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఈ నియోజకవర్గానికి అభ్యర్థి ఎన్నిక తలనొప్పిగా మారింది. దీంతో కొద్ది రోజుల పాటు అభ్యర్థి ఎంపికను వాయిదా వేసే అవకాశాలున్నాయి. ఒకవేళ ప్రధాన నాయకులు అంగీకరిస్తే రెండవ లిస్ట్ లో పేర్లు వచ్చే అవకాశం ఉంది. ఇక అశ్వరరావుపేట నియోజకవర్గంలో 8 మంది దరఖాస్తు చేసుకోగా అందులో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఉద్యమకారుడు జారే అదినారాయణ, సున్నం నాగమణి రేసులో ఉన్నారు. ఈ ముగ్గురు కూడా గట్టి అభ్యర్థులుగానే పరిగణిస్తున్న ఏఐసీసీ, స్క్రీనింగ్ కమిటీ కొద్ది రోజుల పాటు ఆపే ప్రయత్నం చేస్తున్నట్లుగా విశ్వసనీయ సమాచారం.

# దమ్ముంటే ఇప్పుడు రాండీ..తేల్చుకుందాం

(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

నేను బీ ఫార్మ్ తిస్కొనడానికి హైద్రాబాద్ వెళ్తే ఇక్కడ కొందరు ముఠాగా ఏర్పడి గజదొంగల వలే ఖమ్మంలో దూరి కొందరిని కాంగ్రెస్ లోకి చేరుకుంటే మీరు గెలిచినట్లేనా..? నేను లేనప్పుడు కాదు.. దమ్ముంటే ఇప్పుడు రాండీ.. తేల్చుకుందాం.. అని రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ తుమ్మల నాగేశ్వరరావుకు సవాల్ విసిరారు. సోమవారం యువ నాయకుడు పారా ఉదయ్ అధ్వర్యంలో ముస్తఫా నగర్ సెంటర్ నుండి పెద్ద ఎత్తున మోటార్ సైకిల్స్ తో ర్యాలీ చేపట్టారు. పారా ఉదయ్ కుమార్ తో పాటు 200 మంది యువత మంత్రి పువ్వాడ, ఎంపి వద్దిరాజు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా పారా నాగేశ్వర రావు, పారా శ్రీనివాస్, సత్యనారాయణ అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపి వద్దిరాజు రవి చంద్ర మాట్లాడారు..

ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ...యువతకు మంచి అవకాశాలు రావాలంటే అందుకు బీఆర్ఎస్ పార్టీ గొప్ప వేదిక అని అన్నారు.. నేడు యువత బీఆర్ఎస్ ప్రభుత్వంనే కోరుకుంటుందన్నారు. యువతకు కేసీఆర్ అనేక విధాలుగా అనేక పరిశ్రమలు, ఐటితో పాటు స్వయం సహాయ రుణాలు, రాజకీయాలు, వివిధ రంగాల్లో విరివిగా అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. ఖమ్మం ఒకప్పుడు గొంగళి పురుగులా ఉండేది.. కేవలం 4ఏళ్లలో సీతాకొక చిలుక లా మర్చిన ఘనత బీఆర్ఎస్ కే దక్కిందన్నారు. అది మీ స్వీయ అనుభవంలో ఉందన్నారు. నేడు రాష్ట్రంలో ఏ నగరం బాపుంది అంటే టక్కున గుర్తొచ్చేది మన ఖమ్మం నగరమే అని, ఇక్కడ ప్రజలకు కావాల్సిన అన్ని మౌళిక వసతులు కల్పించడమే కారణం అని అన్నారు. అనేక రోడ్లు, అనేక డ్రైన్ లు, పార్కులు, క్రీడా ప్రాంగణాలు, పబ్లిక్ టాయిలెట్స్, ఇంటింటికీ త్రాగునీరు, నిరంతరాయంగా విద్యుత్, రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, సెంట్రల్ డ్రైన్ లు ఇలా అనేక పనులు చేసి చూపించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వందే అని స్పష్టం చేశారు. నేడు ఖమ్మం నగరంలో 75వేల పై చిలుకు మందికి ఆసరా పెన్షన్ లు ఇస్తున్నామని, నిన్న ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోతో ప్రజలకు మరింత లబ్ధి చేకూరనుంది అని అన్నారు. ఇన్నేళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏం చేసింది.. ఎప్పుడైనా పేదలకు ఎం కావాలో తెలుసుకుని చేశారా...? చెప్పాలని ప్రశ్నించారు. నిన్న బీ ఫార్మ్ తిస్కోడానికి హైద్రాబాద్ పోతే బందిపోటు దొంగల్లా ఖమ్మంలో చొరబడి ఒకరిద్దరిని కాంగ్రెస్ లో చేర్చుకుని అదేదో పెద్ద విజయం అన్నట్లు సోషల్ మీడియాలో పెడితే అయిపోయిందా అని విమ్మర్శించారు. నా మీద పోటీ చేసిన ఆయన ను ఓడించిన.. మళ్ళీ ఒడిస్తా.. అదేం పెద్ద విషయం కాదు.. రానున్న రోజుల్లో అదే జరుగుద్ది అని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా.. ఎవరెన్ని ఎత్తులు వేసిన చివరకు ఒడేది కాంగ్రెస్ పార్టీ.. విజయ తీరాన్ని తాకేది బీఆర్ఎస్ పార్టీయే




అని గుర్తుంచుకోవాలి అని సూచించారు. మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ.. ఖమ్మం నగరాభివృద్ధిలో శక్తివంచన లేకుండా పని చేసిన మంత్రి పువ్వాడ వెంటే నడుస్తామని అన్నారు. మా తుది శ్వాస వరకు అజయన్న తోనే మా ప్రయాణం ఉంటుంది అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నాం అని తప్పుడు ప్రచారాలు చేస్తే వారు ఎవరైనా సరే చెప్పుతో కొడతాం అని హెచ్చరించారు. టి కోసం వస్తున్నాం అని ఫోన్లు చేస్తున్నారు, టి త్రాగడానికి బయట షాపులు చాలా ఉన్నాయి అక్కడ తాగండి.. మా ఇంటికి రావొద్దు అని హితువు పలికారు. చిల్లర రాజకీయాలు చేసి డబ్బులు పెట్టి కొంటాం అంటే ఇక్కడ ఎవరు సిద్దంగా లేరన్నారు. బీఆర్ఎస్ లో ఉన్న గుర్తింపు కాంగ్రెస్ లోకి వస్తే వస్తది ఆ?? సిగ్గు పడండి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, మక్బూల్, చామకూరి వెంకన్న, నాయకులు అమరగాని వెంకటేశ్వర్లు, పొన్నం వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# మధిరను కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం

- గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరగవద్దు
- మ్యానిఫెస్టో అద్భుతం
- వచ్చేది బీఆర్ ఎస్ ప్రభుత్వమే..
- కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం ఖాయం
- మధిర పార్టీ కార్యకర్తల సమావేశంలో



ఎంపీ నామ నాగేశ్వరరావు

**మధిర, అక్టోబర్ 16(విజయంన్యూస్):** రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో ప్రతి ఒక్కరూ సుశిక్షితులైన సైనికుల్లా పని చేసి కమల్ రాజ్ ను గెలిపించి, సీఎం కేసీఆర్ కు కానుకగా ఇవ్వాలని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, బీఆర్ ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పార్టీ అభ్యర్థి కమల్ రాజ్ విజయాన్ని కాంక్షిస్తూ మధిరలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో జరిగిన తప్పులు ఈసారి జరగకుండా జాగ్రత్త వహించి, సత్తా చూపించాలని నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మధిర లో కమల్ రాజ్ గెలుపు ఖాయమైందన్నారు. అద్భుతరీతిలో రూపొందిన పార్టీ మ్యానిఫెస్టోను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రచారం చేసి, కమల్ రాజ్ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, మ్యానిఫెస్టో గురించి వివరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వచ్చేది బీఆర్ ఎస్ ప్రభుత్వమేనని, మూడోసారి కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని అన్నారు. రైతు బిడ్డగా కళ్లారా ఎన్నో కష్టాలు చూశానని, కానీ నేడు కేసీఆర్ వల్ల అవేవి రైతుకు లేవన్నారు. సీతారాం ప్రాజెక్టు పూర్తి అయితే ఖమ్మం జిల్లా పూర్తిగా సస్యశ్యామలమవుతుందని అన్నారు.పార్టీ మండల అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ అభ్యర్థి లింగాల కమల్ రాజ్, నాయకులు కొండబాల కోటేశ్వరరావు, కూరకుల నాగభూషణం, నల్లమల వెంకటేశ్వరరావు, ఆరు మండలాల పార్టీ మండల అధ్యక్షులు, కార్యదర్శులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ లు, సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, బూత్ లెవల్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# కూసుమంచిలో ఘనంగా దేవి శరన్నవరాత్రులు

**(కూసుమంచి-విజయంన్యూస్)**

కూసుమంచి మండలం గ్రామంలో కౌండిన్య దళం గౌడ్ సంఘం ఆధ్వర్యంలో మొదటి వార్షికోత్సవం దేవి శరన్నవరాత్రులు రెండో రోజు గాయత్రీ దేవి కి ప్రత్యేక పూజలు చేశారు. రెండో రోజు గాయత్రీ దేవి అమ్మవారి పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంద నాగులు విజయలక్ష్మి , నాగేశ్వరరావు సుజాత వారి కుటుంబ సభ్యులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిరోజు అమ్మవారికి మూడుసార్లు పూజా హారతి, కళాకారుల తో కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కూసుమంచి నివసిస్తున్న సభ్యులందరికీ తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని కూసుమంచి సర్పంచి చెన్నమోహన్ తెలిపారు,విగ్రహ దాత మంద నాగులు వారి కుటుంబ సభ్యులు వారు తరపున అందరికీ దేవీ నవరాత్రులు మరియు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి సర్పంచ్ చిన్న మోహన్ మాజీ సర్పంచ్ భారీ వీరభద్రం, మంద నాగులు గౌడ్, మంద నాగేశ్వరరావు గౌడ్, మంద ప్రసాదు గౌడ్, మంద శేఖర్, మంద రాంబాబు గౌడ్, మంద చిన్న వెంకన్న గౌడ్, విష్ణు గౌడ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎంల భద్రత చాలా అవసరం

## రిషిప్సన్ కేంద్ర ఏర్పాటుకు ప్రతిపాధిత భవనాలను పరిశీలించిన కలెకర్ట్, సీపీ



**ఖమ్మం, అక్టోబర్ 16(విజయం న్యూస్):** రానున్న శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఇవిఎం ల భద్రత, రిషిప్షన్ కేంద్ర ఏర్పాటుకు ప్రతిపాదిత భవనాలను జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్ తో కలిసి సోమవారం పరిశీలించారు. వైరా అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్లు, సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జ్యోతి నిలయం హైస్కూల్ లను పరిశీలించి, చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులకు సూచనలు చేశారు. ఇవిఎం ల భద్రతకు గదులు, భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన చర్యల గురించి పరిశీలించారు. రిషిప్షన్ కేంద్ర ఏర్పాటు, భోజన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ ల ఏర్పాటుపై చుట్టూ తిరిగి పరిశీలించారు. బ్యారికేడ్ల ఏర్పాటు విషయమై అధికారులకు సూచనలు చేశారు. విద్యా సంస్థల్లో ఎన్నికల ప్రక్రియ చేపడుతున్న రోజులు ముందస్తుగా ఆయా విద్యాసంస్థల యాజమాన్యం కు తెలియపర్చి, ఆ రోజుల్లో పాఠశాలకు సెలవులు ఇచ్చేలా చూడాలన్నారు. ఇవిఎం స్ట్రాంగ్ రూమ్, అదనపు ఇవిఎం లతో సహ భద్రపర్చడానికి సరియైన హాల్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇవిఎం కమీషనింగ్ కి అనువైన హాల్ చూడాలన్నారు. అనువుగా ఉండుటకు భవనాలకు ఏమైనా తాత్కాలిక మార్పులు చేపడితే, ఎన్నికల ప్రక్రియ తర్వాత యదాస్థితి తిరిగి అప్పగించాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, అదనపు డిసిపి ప్రసాద్ రావు, కల్లూరు ఆర్డీవో అశోక్ చక్రవర్తి, ఏసీపీలు రహమాన్, రామాంజనేయులు, తహసీల్దార్లు శ్రీనివాస్, బాబ్జి ప్రసాద్, మునిసిపల్ కమిషనర్లు వెంకటేశ్వర్లు, సుజాత, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ప్రసాద్, అధికారులు తదితరులు ఉన్నారు.

# కుంజా సత్యవతి ఇకలేరు

(మొదటిపేజీ తరువాయి..)

ఆ తర్వాత వైఎస్సార్ చొరవతో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2009 నుంచి 2014 వరకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కుంజ సత్యవతి కాంగ్రెస్ పార్టీ తరుపున భద్రాచలం నియోజకవర్గంలో పోటీ చేసి ఎమ్మెల్యే గా భారీ మెజార్టీతో గెలుపొందారు. కమ్యునిస్ట్ ల కంచు కోట అయిన భద్రాచలం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగరవేసిన ఘనత ఆమెకే దక్కింది. వరసగా మూడు సార్లు గెలిచిన సీపీఎం పార్టీని ఎదురించి విజయం సాధించిన ఆమె కోయ్య పులిబిడ్డగా అభివర్ణించారు. అనంతరం వైఎస్ చనిపోయిన తర్వాత ఆమె వైసీపీలో చేరారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటమి చెందారు. ఆ తరువాత రాజకీయ పరిణామాల్లో భాగంగా ఆమె బీజేపీ పార్టీలో చేరారు. 2018 ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన సత్యవతి ఓటమి చెందగా, 2023 ఎన్నికల్లో పోటీ చేసేందుకు సమయత్తం అవుతున్నారు. ఈ సమయంలోనే ఆమె హఠన్మారణం బీజేపీ క్యాడర్ ను దెబ్బతిసినట్లైంది. దీంతో భద్రాచలం విషాదంలో మునిగింది.

### దిగ్భ్రాంతికి గురైన తుమ్మల, పోదెం వీరయ్య

మాజీ ఎమ్మెల్యే సత్యవతి మరణవార్త విన్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మరణవార్తకు చింతిస్తున్నామని తెలిపారు. ఆమె రాజకీయ ప్రాస్థానంను గుర్తు చేసుకున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆమె నాతోటి ఎమ్మెల్యేగా పనిచేశారని గుర్తు చేసుకున్నారు. ఆమె భద్రాచలం నియోజకవర్గ అభివద్ధి కోసం చాలా ప్రయత్నం చేశారని అన్నారు. ఆమె భౌతిక కాయానికి భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య నివాళి అర్పించారు.అలాగే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆమ కుటుంబాన్ని ఓదార్చారు. వారికి సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.



### సంతాపం తెలిపిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఈటెల

ఆమె మరణ వార్త విన్న నియోజకవర్గ ప్రజలు, ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, ఎంపీ బండి సంజయ్ ఫోన్లో సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారిని ఓదార్చారు. ప్రగాడ సంతాపం, సానుభూతిని తెలిపారు. రాష్ట్ర బీజేపీ కిషాన్ మోర్చ అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తదితర బీజేపీ నాయకులు ఆమె భౌతికకాయానికి నివాళ్లు అర్పించారు.

# మ్యానిఫెస్టో అద్భుతం



- అన్ని వర్గాల అభివృద్దే లక్ష్యంగా మ్యానిఫెస్టో
- ఆత్మీయ సమావేశంలో ఎంపీ నామ నాగేశ్వరరావు

**(ఖమ్మం-విజయం న్యూస్):**

బడుగు, బలహీన వర్గాల సర్వతో ముఖాభివృద్దే లక్ష్యంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో రూపొందిందని పార్టీ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం 54వ డివిజన్ వీడియోస్ కాలనీలో ఆడిటర్ శివరామకృష్ణ ఇంటి వద్ద సోమవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో నామ మాట్లాడారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అద్భుతంగా ఉందన్నారు. దీని ద్వారా మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. కేసీఆర్ ఎప్పుడూ తెలంగాణా గురించి, తెలంగాణా ప్రజల గురించే ఆలోచిస్తుంటారని అన్నారు. అందుకే ఆయన మదిలో బ్రహ్మాండంగా అవిష్కృతమైందే పార్టీ మ్యానిఫెస్టో అన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని, పార్లమెంట్ ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రైతు బిడ్డగా క్షేత్ర స్థాయిలో అన్నీ చూశానని, నిత్యం ప్రజల గురించి ఆలోచించే కేసీఆర్ కు అండగా నిలిచి, అక్కున చేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్నాటి కృష్ణ, కేవస్ బాబ్జీ,బత్తుల మురళీ, పారా నాగేశ్వరరావు, దుద్దుకూరి సత్యనారాయణ, పుతు%శీ%బాక నరేష్, ఆడిటర్ శివరామకృష్ణ, వల్లభనేని రామారావు, మోరంపూడి ప్రసాద్, గొడ్డేటి మాధవరావు, వాకదాని కోటేశ్వరరావు, నామ సేవా సమితి నుంచి చీకటి రాంబాబు, కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



### ఎంత ఎత్తు ఎదిగినా....

ఎంపీ నామ నాగేశ్వరరావు ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగి ఉండడం ఆయనకే సాధ్యమైందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఖమ్మం వీడియోస్ కాలనీలో టీఎస్ జెన్కో రిటైర్డ్ ఏడీఏ మధుసూదన్ రావు ఇంటి వద్ద కేటీపీఎస్ రిటైర్డ్ ఇంజనీర్లు, ఉద్యోగులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఎంపీ నామ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కేటీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగులు మాట్లాడుతూ ఎంపీ నామ కింది స్థాయి నుంచి ఎంపీ స్థాయికి ఎదిగి, పార్లమెంట్ లో ప్రజా సమస్యలపై హిందీలో ఎంతో సమర్థవంతంగా మాట్లాడడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కరోనా సమయంలో సొంత డబ్బు ఖర్చు చేసి, సేవాలందించారని అన్నారు. అంతేకాకుండా నామ ముత్తయ్య ట్రస్ట్ ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీఎస్ ఎలక్ట్రసిటీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎ. మధుసూధన్ రావు,ఈశ్వరయ్య, వీరభద్రం, నిరంజన్ రెడ్డి, సత్యనారాయణ, బాపయ్య, కోటేశ్వరరావు, బాబు, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఖమ్మంలో పలు కుటుంబాలకు ఎంపీ నామ పరామర్శలు

బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం. పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు సోమవారం ఖమ్మం నగరంలో విస్తృతంగా పర్యటించి, పలు చోట్ల జరిగిన ఆత్మీయ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలను కూడా పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ నామ నాగేశ్వరరావు ఖమ్మం వీడియోస్ కాలనీలో నల్లమల పూర్ణచందర్ రావు ఇంటికి వెళ్లి, ఆయన భార్య లలిత చిత్ర పటానికి పూల మాల వేసి, శ్రద్ధాంజలి, ఘటించి, సంతాపం తెలిపి, నివాలర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పూర్ణచందర్ రావు కుటుంబ సభ్యులతో పాటు రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీడియోస్ కాలనీలో ఇటీవల రిటైర్డ్ ఫారెస్ట్ రేంజర్ మూలగండ్ల వెంకటేశ్వరరావు గారి కుమారుడు రమేష్ నాయుడు మృతి చెందగా, వారింటికెళ్ళి రమేష్ నాయుడు చిత్ర పటానికి పూల మాల వేసి, నివాలర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు.

ఎర్రగుంట, కొత్త కారాయిగూడెంలో పలు కుటుంబాలను పరామర్శించిన ఎంపీ నామ నాగేశ్వరరావు

అన్నపురెడ్డిపల్లి, పెనుబల్లి మండలాల్లో నామ విస్తృతంగా పర్యటించి, పలు కుటుంబాలను పరామ ర్శించారు. అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంటలో పార్టీ సీనియర్ నాయకులు బోయినపల్లి వెంకట సుబ్బారావు మృతి చెందగా దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుబ్బారావు చిత్ర పటానికి పూల మాల వేసి, శ్రద్ధాంజలి ఘటించి, సంతాపం తెలిపి, నివాలర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దైవాన్ని ప్రార్థించారు. తర్వాత పెనుబల్లి మండలం కొత్త కారాయి గూడెంలో మేడా మోహన్ రావు తండ్రి మేడా కృష్ణయ్య, ఎం. రామకృష్ణ మృతి చెందగా, వారి చిత్ర పటాలకి పూల మాల వేసి, నివాలర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, పెనుబల్లి,చంద్రుగొండ, వైరా మండలాల పార్టీ అధ్యక్షులు కనగాల వెంకట్రావ్, దారా బాబు, బాణాల వెంకటేశ్వరరావు, పెనుబల్లి ఎంపీపీ లక్కినేని ఆలేఖ్య వినీల్, సర్పంచ్ లు దొడ్డపనేని శ్రీదేవి, చెన్నారావు, ఆళ్ల అప్పారావు, తావ్య నాయక్, లగడపాటి శ్రీను, అశోక్, చంద్రుగొండ మండల కార్యదర్శి ఉప్పునూతల ఏడుకొండలు, భూపతి శ్రీను, రసూల్, వీరబోయిన వేంకటేశ్వర్లు, పుల్లారావు, హరీష్, వెంకట నారాయణ, చిన్న పిచ్చయ్య, అంజన్ రావు, రాములు తో పాటు గొడ్డేటి మాధవరావు, వాకదాని కోటేశ్వరరావు, నామ సేవా సమితి నుంచి చీకటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# రిటర్నింగ్ అధికారులు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలి



**ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలి**

**వేంసూరు మండలంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్**

(సత్తుపల్లి-విజయంన్యూస్)

రిటర్నింగ్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అన్ని ముందస్తు ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ తెలిపారు. సోమవారం కలెక్టర్ వేంసూరు మండలం మద్దులగూడెం గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, యరసాని వారి బంజర గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, సత్తుపల్లి మండలం బేతుపల్లి గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, బేతుపల్లి గంగారం గ్రామం దాసరి వీరారెడ్డి జెడ్పి ఉన్నత పాఠశాల, కల్లూరు మండలం హనుమాతాండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాను కలెక్టర్ పరిశీలించారు. తొలగించిన ఓట్ల విషయమై ఆ ప్రాంత ప్రజలు, రాజకీయ పక్షాల వారితో ఆరా తీశారు. తొలగించిన ఓట్ల పేరు వారు షిఫ్ట్ అయింది, మరణించింది అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉన్నది అడిగి తెలుసుకున్నారు. సి విజిల్ యాప్ గురించి అవగాహన కల్పించారు. సి విజిల్ యాప్ ద్వారా డబ్బు, మద్యం ప్రలోభాలు, భయబ్రాంతులకు గురిచేయడం ఏదైనా దృష్టికి వస్తే వెంటనే ఫోటో, వీడియో ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారు ఫోన్ నెంబర్, వివరాలు గోప్యంగా ఉంచొచ్చని అన్నారు. ఫిర్యాదు చేయగానే 20 నిమిషాల అధికారులు చేరుకొని చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో త్రాగునీరు, ఎలక్ట్రిసిటీ, టాయిలెట్స్, షామియాన మౌళిక వసతులు కల్పించాలని, వికలాంగుల కొరకు ర్యాంప్ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రతి బూత్ లెవల్ అధికారి వారి పరిధిలో కనీసం 50 మంది యువతను ఎంపిక చేసి, సి విజిల్ యాప్ డౌన్లోడ్ చేసుకునేలా చూడాలని, యాప్ పై అవగాహన కల్పించాలని అన్నారు. ఉపాధ్యాయులు సి విజిల్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని ఆయన అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎంతమంది క్రొత్త ఓటర్లుగా నమోదు అయింది, ఎంతమంది ఓటర్లు షిఫ్ట్ అయింది, డూప్లికేట్ ఓటర్లు వివరాలు అడిగి తెలుసుకున్నారు. షిఫ్టెడ్, డూప్లికేట్ ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. జుల్కె వరకు ఆమోదించిన దరఖాస్తులకు ఎపిక్ కార్డులు ఓటర్లకు చేరినట్లు ఆయన అన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ప్రదర్శించిన ఫోటో ఓటర్ జాబితాను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కల్లూరు ఆర్డీవో అశోక్ చక్రవర్తి, తహసీల్దార్లు, అధికారులు తదితరులు ఉన్నారు.



# మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్ లక్ష్యం

**అందరు పార్టీ బలోపేతం కోసం ప్రయత్నం చేయండి**

**మైనార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించిన జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్లా**

(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

మైనార్టీల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని, అనేక దఫాలుగా పరిపాలన సమయంలో ముస్లీం,మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వాలు పెద్దపీఠ వేశాయని, రాబోయే రోజుల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో అన్ని రంగాల్లో కచ్చితంగా ముస్లీం మైనార్టీలకు పెద్దపీట వేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా మైనారిటీ అద్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన మైనారిటీ సెల్ జిల్లా,మండల నాయకుల సమావేశం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాబోయే ఎన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధుల విజయానికి ఆశేషంగా కృషి చేసి గెలిపించాలని దిశా నిర్దేశం చేసినారు. ఆనంతరం జిల్లా మైనారిటీ అద్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ జిల్లా, మండల మైనారిటీ నాయకులు మైనారిటీ మండల కమిటీ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధుల విజయానికి పాటుపడాలిని , అన్ని బూత్ లలో ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధులను గెలిపించాలని ప్రతి ఒక్కరు సైనికుని వలే పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు రఫీ, మజీద్ పాషా, ఫయాజ్ హుస్సేన్, అన్వర్ హుస్సేన్, నాగుల్ మీరా, జాకీర్ హుస్సేన్, షాజహాన్, సయ్యద్ మెహరజ్, షేక్ పాషా, అబ్దుల్ జబ్బార్, సయ్యద్ జానిపాషా, షేక్ బాజి, షేక్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లెందులో బీఆర్ఎస్‌కు మరోషాక్

- బీఆర్ఎస్ కు గుడ్ బై చెప్పిన వందలాది కుటుంబాలు
- జెడ్పీ చైర్మన్ కోరం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు
- భారీగా తరలివచ్చి,ఘన స్వాగతం పలికిన గ్రామస్థులు
- బీ.ఆర్.ఎస్ అవకాశవాద పార్టీ,కాంగ్రెస్ అక్కున చేర్చుకునే పార్టీ..జెడ్పీ చైర్మన్ కోరం



**(ఇల్లందు-విజయం న్యూస్)**

ఇల్లందు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. ఒక వైపు ఎన్నికల సమయం ముంచుకోస్తుండగా మరో వైపు కాంగ్రెస్ వైపు వలసల జోరు ఊపందుకుంది. ఇల్లందు మండలం,ధనియాల పాడు గ్రామ పంచాయతీలోని బీ. ఆర్. ఎస్, న్యూడెమోక్రసీ పార్టీల నుంచి 100 కుటుంబాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా, కండువలు కప్పి స్వాగతం పలికారు. ధనియాల పాడు గ్రామానికి చెందిన వార్డు మెంబర్లతో పాటుగా మిగిలిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ న్యూడెమోక్రసీ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే పథకాలను ప్రవేశపెట్టడం లేదని, కాంగ్రెస్ పార్టీ గతంలో అనేక సంక్షేమాభివద్ది పథకాలను ప్రజల కోసం ప్రవేశపెట్టిందని, ప్రస్తుతం ఆరు గ్యారెంటీ కార్డులు కూడా మాకు ఎంతగానో నచ్చాయని, అందుకే రాహుల్ గాంధీ పై, కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో ఆ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోరం కనకయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ, ఆ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ పదేళ్ల పాటు మాయమాటలతో ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుకున్నారని, ఎంత చూసిన ప్రజలకు మేలు చేసే పథకాలను అమలు చేయకుండా కార్పోరేట్ శక్తులకు మేలు చేసే పథకాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవలే విడుదల చేసిన మేనిపెస్టో ప్రజలు నమ్మలేని విధంగా సత్యానికి దూరంగా ఉన్నాయని అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు అద్భుతమైన గ్యారంటీ స్కీమ్‌లు ప్రజలను అకర్షితులను చేస్తున్నాయని స్పష్టం చేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలు ఉప్పెనలా తరలివస్తున్నారని, రాబోయేది ఇందిరమ్మ రాజ్యమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పులి సైదులు, ప్రధాన కార్యదర్శి అరెం కిరణ్,మండల మైనారిటీ ఉపాధ్యక్షులు మోయిన్, సర్పంచులు తాటి చుక్కమ్మ, ఛాట్ల భాగ్యమ్మ, పాయం స్వాతి, కల్తీ పద్మ, పాయం లలిత, ఎంపీటీసీలు మండల రాము,పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్,మాజీ ఎంపీటీసీ దన్ సింగ్,ఉప సర్పంచులు కుర్రా అరుణ, పోటు రవి, వార్డు మెంబర్లు బానోత్ రాంబాబు, ఊరుగొండ ధనుంజయ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బానోత్ శ్రీను, భూక్యా వీరన్న, ఎల్లంపల్లి బుచ్చయ్య, నాయకులు తాటి బిక్షం, ముక్తి కృష్ణ,కిన్నెర నర్సయ్య, చెన్నూరి కృష్ణ, చెన్నూరి శ్రీనివాస్, బానోత్ రాంబాబు, గుగ్లోత్ శారద, గుగ్లోత్ నాగార్జున, ఆముదాల ప్రసాద్, కాకాటి భార్గవ్, రావూరి సతీష్, ప్రసన్న కుమార్ యాదవ్, పాయం ఆంజనేయులు, సప్పిడి ప్రవీణ్, ఉల్లింగ సతీష్, భూక్యా శంకర్, పాల్గొన్నారు.

# మోసపూరిత హామీల వర్షం కురిపించిన సీఎం

- సత్యానికి దూరంగా బీ.ఆర్.ఎస్ మేనిఫెస్టో
- కాంగ్రెస్ పార్టీ పథకాలు కాపీ కొట్టి మూడోసారి గద్దెనెక్కెందుకు ప్రయత్నం
- రానున్నది ఇందిరమ్మ రాజ్యమే
- విలేకర్ల సమావేశంలో జడ్పీచైర్మన్ కోరం కనకయ్య



**(ఇల్లందు-విజయంన్యూస్)**

నా మేనిఫెస్టో చూడండి.. అందరికంటే అద్భుతంగా ఉంటుంది.. సంచలనంగా ఉంటుందని, అందరికి ఆదర్శంగా ఉంటుందని గొప్పలు చెప్పిన సీఎం కేసీఆర్.. నిన్న ప్రకటించిన మేనిఫెస్టో ను చూస్తే మోసపూరిత హామిల వర్షం కురిపించినట్లు ఉందని భద్రాద్రికొత్తగూడెం జిల్లా జడ్పీచైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య విమ్మర్శించారు. ఇల్లందు పట్టణంలో గల జెడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య పాల్గొని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ ప్రవేశపెట్టిన ఎన్నికల మ్యానిఫెస్టో విషయంలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు..కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోని పోలిన హామీలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి కెసీఆర్ ప్రకటించడం నిజంగా హాస్యాస్పదం అన్నారు. గడిచిన నాలుగున్నర ఎండ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదు కానీ, పేదలకు మాత్రం సన్నబియ్యం పంపిణీ చేస్తామనడం,రాష్ట్రంలో డబుల్ బెడ్రూం ల ఊసేలేదని,దళితబంధు పేరిట దగాచేస్తూన్నారని,గృహలక్ష్మి పథకం కింద పక్కా గృహాలు వస్తాయన్న నమ్మకంతో నిరుపేదలు ఉన్న గృహాలు కూడా కూల్చుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆరోపించారు. గడిచిన తొమ్మిదిన్నర యెండ్లలో రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని, బీఆర్ఎస్ పాలనలో సామాన్యుడి మనుగడ ప్రశ్నార్ధకంగా మారిందన్నారు. పేదల సంక్షేమం కోసం ఏనాడూ గుర్తుకురాని పథకాలు ఎన్నికల నాటికి ప్రవేశపెట్టి,కనీసం రాష్ట్ర మంత్రులను కానీ,ఎమ్మెల్యే లకు గానీ అందుబాటులో ఉండకుండా కేవలం ప్రగతిభవన్ కే పరిమితం అయ్యారని విమ్మర్శించారు. నేడు ఎన్నికలు సమీపిస్తుండటంతో రాష్ట్రమంతటా సభలు,సమావేశాలు నిర్వహించి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ, హడావుడి చేసి మూడోసారి గద్దెనెక్కటానికి తాపత్రయం పడుతున్నా రాష్ట్ర ప్రజలు మిమ్మల్ని నమ్మేందుకు సిద్ధంగా లేరని,రానున్న రోజుల్లో అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డా డానియెలు,పులి సైదులు, పట్టణ,మండల ప్రధాన కార్యదర్శులు మహ్మద్ జాఫర్, అరెం కిరణ్,మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీమతి.అనసూర్య,సర్పంచులు పాయం స్వాతి, కల్తీ పద్మ, పాయం లలిత,ఎంపీటీసీలు మండల రాము,పూనెం సురేందర్,పాయం కృష్ణప్రసాద్, తాటి యశోద,ఉప సర్పంచ్ తాటి రాంబాబు,వార్డు సభ్యులు ఊరుగొండ ధనుంజయ్, బానోత్ రాంబాబు,పట్టణ, మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

# సెర్ఫ్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా జర్పుల

**ఏన్కూరు, అక్టోబర్ 16(విజయం న్యూస్):**



తెలంగాణ గ్రామీణ అభివృద్ధి ఉద్యోగుల సంక్షేమ సంఘం (సెర్ఫ్) జిల్లా ఉపాధ్యక్షుడుగా ఏన్కూరు మండలం గార్లఒడ్డు గ్రామానికి చెందిన జర్పుల వెంకటేశ్వర్లను ఎన్నుకున్నారు. ఖమ్మంలో జరిగిన గ్రామీణ అభివృద్ధి ఉద్యోగుల సంక్షేమ సంఘం జనరల్ బాడీ సమావేశంలో జర్పుల వెంకటేశ్వర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో పాటు గౌరవ అధ్యక్షులను, కోశాధికారిని, సహాయ కార్యదర్శిలను, ప్రచార కార్యదర్శులను, సలహాదారులను, మహిళా కన్వీనర్, మహిళ కో-కన్వీనర్లను ఎన్నుకున్నారు. గ్రామీణాభివృద్ధి ఉద్యోగుల సంక్షేమానికి తాను శాయశక్తులా కృషి చేస్తానని జిల్లా ఉపాధ్యక్షునిగా ఎంపికైన జర్పుల వెంకటేశ్వర్లు అన్నారు. ప్రస్తుతం వెంకటేశ్వర్లు ఏన్కూరు మండలంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ గా విధులు నిర్వహిస్తున్నారు.



# ఏన్కూరులో పత్తి కొనుగోళ్ళ ప్రారంభం

**ఏన్కూరు, అక్టోబర్ 16(విజయం న్యూస్):**

ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం నుంచి పత్తి కొనుగోళు ళ్ళ ప్రారంభమయ్యాయి. మండలంలో పత్తి చేతికొస్తుండడంతో రైతులు మార్కెట్ యార్డుకు తీసుకొస్తున్నారు. తొలి రోజు క్వింటా పత్తి ధర రూ.6600 పలికింది. సోమవారం సాయంత్రానికి కేవలం 52 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. రైతులు మార్కెట్ యార్డులోనే పత్తిని అమ్మి ఆశించిన ధర పొందాలని అధికారులు కోరుతున్నారు. ఈ ఏడాది మండలంలో సుమారు 10వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. సాధారణంగా ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయి. ఈ ఏడాది అదే స్థాయిలో దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు తెలిపారు.

# చెక్ పోస్ట్‌ల వద్ద పటిష్ట నిఘా చర్యలు

**తిరువూరు క్రాస్ రోడ్ లో చెక్ పోస్ట్ ను పరిశీలించిన కలెక్టర్, సీపీ**



**ఖమ్మం, అక్టోబర్ 16(విజయంన్యూస్):**

చెక్‌పోస్ట్‌ల వద్ద పటిష్ట నిఘా చర్యలు చేపట్టి విస్తృత తణిఖీలు నిర్వహించాలని, నగదు, మద్యం రవాణాను నియంత్రించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. కలెక్టర్, సోమవారం పోలీసు కమీషనర్ విష్ణు. యస్ వారియర్‌తో కలిసి తిరువూరు క్రాస్ రోడ్ చెక్ పోస్ట్, కల్లూరు మండలం పేరువంచ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన ఇంటర్ స్టేట్ (తెలంగాణ-ఏపీ సరిహద్దు) చెక్‌పోస్ట్, ముత్తగూడెం గ్రామం వీఎం బంజర వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ (తెలంగాణ-ఏపీ సరిహద్దు) చెక్‌పోస్టులను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది విధులు నిర్వహణ, ఎన్ని వాహనాలు తనిఖీ చేసింది అడిగి తెలుసుకున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆయన తెలిపారు. నగదు, మద్యం రవాణా నియంత్రించాలన్నారు. సిసి కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల తనిఖీ సంబంధించి రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. ప్రతి చెక్ పోస్ట్‌లో వీడియోగ్రఫీకి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అప్రమత్తంగా వుంటూ, 24 గంటల పటిష్ట నిఘా పెట్టాలని

# పల్లెల్లో ప్రచార హోరు...

- గ్రామాల బాట పట్టిన నాయకులు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు గడప గడపకు
- ఓట్ల కోసం లీడర్ల పాట్లు
- మధిర నియోజకవర్గం లో జోష్ పెంచనున్న పార్టీలు
- సంక్షేమ కార్యక్రమాలతో బీఆర్ఎస్ నేతలు
- ఆరు గ్యారెంటీ లతో కాంగ్రెస్ విస్తృత ప్రచారం
- పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కమ్యూనిస్టుల ప్రచారం

**బోనకల్, అక్టోబర్ 17(విజయం న్యూస్)**

ఎన్నికల పండగ మొదలు కావడంతో మధిర నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, కమ్యూనిస్టు నాయకులు పల్లెబాట పట్టారు. చోటా మోటా నేతల దగ్గర నుండి ఎమ్మెల్యే అభ్యర్థి వరకు గ్రామాల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పరుగులు పెడుతున్నారు. ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అభ్యర్థులు ఓటర్లను తమ గుప్పెట్లో ఉంచుకునేందుకు అనేక అగచాట్లు పడుతున్నారు. అమూల్యమైన ఓటును తమకే వేయాలని ప్రాధేయ పడుతున్నారు. ఎన్నికల కోడ్ కు ముందే గులాబీ అధినేత మధిర నియోజకవర్గ అభ్యర్థిగా లింగాల కమల్ రాజును ప్రకటించడంతో ఆ పార్టీ నేతలు అందరికంటే ముందుగానే ఓటర్లను కలుసుకున్నారు. కాంగ్రెస్ సైతం అభ్యర్థులను ప్రకటించడం తో ఇక్కడి నుంచి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పోటీ ఖాయమైన నేపథ్యంలో ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ప్రచారాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. కమ్యూనిస్టులు మాత్రం పొత్తుల్లో ఎక్కడ పోటీ చేయాలో అనే విషయం ఖరారు కాకపోవడంతో ప్రచారంలో జోష్ పెంచలేదు. కాగా సిపిఎం ప్రజా సమస్యలపై పోరాడుతూ తమ ఓటు బ్యాంకు నిలుపుకునే ప్రయత్నం చేస్తుంది.




## ప్రచారంలో కారు జోరు...!

నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లో ప్రచారం విషయంలో కారు జోరు పెంచింది. ఈసారి ఎలాగైనా గెలవాలని లక్ష్యంతో లింగాల కమల్ రాజ్ విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే చేరికలను ఉమ్మరం చేశారు. మధిర నియోజకవర్గానికి టిఆర్ఎస్ ఇన్చార్జిగా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ను సీఎం కేసీఆర్ నియమించడంతో ఆ పార్టీ మరింత ఊపుతో ముందుకెళు ్తంది. ఇప్పటికే కమల్ రాజు క్షణం తీరిక లేకుండా ఐదు మండల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాల్లో మొత్తం కలియ తిరిగారు. అభివృద్ధిని చెప్పుకుంటూ తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రచారం కొనసాగిస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించడంతోపాటు కళాశాలలు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు ప్రముఖులు తదితరులతో విడివిడిగా సమావేశం నిర్వహించి బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని క్షుణ్ణంగా వివరించి ఓట్లు రాబట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. అదేవిధంగా మరోవైపు కాంగ్రెస్ నేత సీఎల్పీ లీడర్ మల్లు భట్టి విక్రమార్క ప్రభుత్వ విధానాలను ఎండగడతో తాను ఎన్నికల్లో తామ్యాధికారులకు వస్తానని



తమ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేస్తామని చెబుతూ ఓట్లు రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా ఖమ్మం జిల్లా అభివృద్ధి చెందిందని అందుకు కారణం టిఆర్ఎస్ పార్టీ అని సంక్షేమ కార్యక్రమాలను ఓటర్లకు క్షుణ్ణంగా తెలియజేసే పనిలో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. 70 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ చేయలేని పనులు 10 సంవత్సరాలలో బిఆర్ఎస్ పార్టీ చేసిందని చెప్పుకుంటూ ప్రత్యర్థులపై విమర్శలు గుప్పిస్తూ ప్రచార నిర్వహిస్తున్నారు.

## గెలుపు కోసం కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు..

కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికార పార్టీకి దీటుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. గత పది సంవత్సరాల కాలంలో అధికార టిఆర్ఎస్ పార్టీ చేసిన అక్రమాలను ప్రజల ముందు ఎండగడుతూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. నిన్నటి వరకు బిఆర్ఎస్ పార్టీలో ఉండి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు వర్గీయులు సైతం నియోజకవర్గంలో క్షణం తీరిక లేకుండా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ప్రదర్శనలు, ర్యాలీలు , పాదయాత్రలు ముమ్మరం చేస్తూ అధికార పార్టీ అక్రమాలను ఎండగడుతున్నారు. ప్రధానంగా అసెంబ్లీ ఎన్నికల్లో విజయాన్ని కైవసం చేసుకోడానికి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రజల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. కర్ణాటక తరహాలోనే ఇక్కడ సైతం హామీలు అమలు చేస్తామని హామీలు ఇస్తున్నారు. దీంతో పాటుగా ప్రియాంకా గాంధీ విడుదల చేసిన యూత్ డిక్లరేషన్, ఖర్గే విడుదల చేసిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, రాహుల్ గాంధీ వరంగల్లో ప్రకటించిన రైతు డిక్లరేషన్ వంటి విషయాలను ప్రజల వద్దకు తీసుకుపోతున్నారు. మరోవైపు సిపిఎం సిపిఐ తమ పట్టు నిలుపుకునేందుకు ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నాయి కాంగ్రెస్తో పొత్తు ఉంటుంది అనే వార్తలు వస్తున్నప్పటికీ అది ఇంకా తేలక పోవడంతో ఆ పార్టీ కొంత సందిగ్ధంలో ఉంది కాంగ్రెస్తో పొత్తు లేకుండాట్లయితే ఒంటరిగా నాయనా పోటీ చేసేందుకు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు సిద్ధమైనట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికీ ఆయా పార్టీల నేతలు గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పరుగులు పెట్టడం విశేషంగా చెప్పవచ్చు. మరీ రాబోయే రోజుల్లో జరిగే ఎన్నికల కురుక్షేత్ర యుద్ధంలో ప్రజలు ఎవర్ని గెలిపిస్తారో..? ఎవర్ని అసెంబ్లీకి పంపిస్తారో..? వేచి చూడాల్సిందే..?

# ఎన్నికల నియమనిబంధనలపై అధికారులు పూర్తి అవగాహణ కల్గి ఉండాలి

### కలెక్టర్ వి.పి.గౌతమ్

**ఖమ్మం, అక్టోబర్ 16(విజయంన్యూస్):**

ఎన్నికల నియమ నిబంధనలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఏఎల్ఎంటి, ఏఆర్ఓ లకు ఎన్నికల ప్రక్రియలో అర్హత, అనర్హత, నామినేషన్ స్క్రూటిని, విత్ డ్రాయల్స్, గుర్తుల కేటాయింపుపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులు ఎన్నికల ప్రతి ప్రక్రియలో జాగ్రత్తలు వహించి, సమర్ధవంతంగా విధులు చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. నామినేషన్ స్క్రూటిని ప్రక్రియ ఎంతో కీలకమయినదని, నిబంధనల మేరకు పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదిత వ్యక్తి, ఆయా నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రీయ, గుర్తింపు పొందని పార్టీల విషయమై మార్గదర్శకాల మేరకు నడవాలన్నారు. ఎస్సి, ఎస్టీ రిజర్వ్ స్థానాల్లో అభ్యర్థి ఆయా వర్గానికి చెందినవారై ఉండాలన్నారు. ప్రతి దశలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పవర్ పాయింట్




ప్రజంటేషన్ ద్వారా అధికారులకు నామినేషన్ స్క్రూ టిని, గుర్తుల కేటాయింపు తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా ఉపాధికల్పనాధికారి శ్రీరామ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ గోపాల్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, ఏఎల్ఎంటి, ఏఆర్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మల్ల దివ్యప్రశాంతికి సావిత్రి భాయి ఫూలే అవార్డు

**ఏన్కూరు, అక్టోబర్ 16(విజయం న్యూస్):**

ఏన్కూరు మండలం తిమ్మారావుపేట గ్రామంలోని ఓం ఆదిత్య గాయత్రి పాఠశాల ఉపాధ్యాయురాలు తుమ్మల్ల దివ్యప్రశాంతి సావిత్రిబాయి పూలే అవార్డుకు ఎంపికయ్యారు. ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా ఆమెకు ఈ అవార్డు అందజేశారు. శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ 20వ వార్షికోత్సవ వేడుకలు, జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేస్తూ సామాజిక దృక్పథం కలిగి ఉన్న ఉపాధ్యాయురాలు దివ్యప్రశాంతికి ఈ అవార్డు లభించింది. ఈ కార్యక్రమం లో ఎస్ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ అమరేష్, తెలంగాణ ఇన్కమ్ టాక్స్ కమిషనర్ లావుడ్యా జీవన్ లాల్, నిట్ వరంగల్ ప్రొఫెసర్ ఎన్.వి.ఉమా మహేష్, వరంగల్ ఎస్వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమలరావు, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సిఓఈ, సమన్వయ కర్త కొమ్మిని కిషోర్, ట్రస్మా రాష్ట్ర కోశాధికారి ఎన్.వి. రమణారావు, ట్రస్మా ఖమ్మం జిల్లా అధ్యక్షులు రాంచందర్ రావు, ట్రస్మా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బండి లక్ష్మణ్, ఎస్ఆర్ఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ దాసరి రమేష్, పలు విద్యా సంస్థల కరెస్పాండంట్ లు పాల్గొన్నారు.



# భద్రాద్రి గులాబీ పోరులో తెల్లం నెగ్గేనా..?




(మొదటిపేజీ తరువాయి..)

గుర్రుగా ఉన్నారా..? ఆయన వల్ల పార్టీకి పెనుప్రమాదం పొంచిఉందా..? అంటే నిజమేని అంటున్నారు భద్రాచలం పౌరులు.. ఓ లీడర్ చేతిలో కారు స్టీరింగ్ ఉండటం.. ఆయన చెప్పినట్లుగా కారు తిరగడం చూస్తుంటే బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో అంతర్గత కుమ్ములాటలు వచ్చే అవకాశం కనిపిస్తున్నట్లు తెలుస్తోంది.. బయటకు చెప్పుకోలేని కొందరు నేతలు పార్టీని వీడే అవకాశం ఉన్నట్లు సమాచారం. భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి ఎలా ఉండబోతుంది.. రాబోయే కురుక్షేత్ర యుద్ధంలో ఎవరు గెలవబోతున్నారు..? పూర్తి వివరాలను ఒక సారి పరిశీలిస్తే..

దక్షణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచల సీతారామచంద్రస్వామి నడియాడిన భద్రాచలం నియోజకవర్గంలో 1955 నుంచి ఇప్పటి వరకు 14 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా, ఒక సారి ఉప ఎన్నికలు జరిగాయి. అందులో రెండు సార్లు సీపీఐ, 6 సార్లు కాంగ్రెస్, 7 సార్లు సీపీఎం పార్టీలు విజయం సాధించాయి. ప్రతి సారి సీపీఎం వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగా పోరాటం సాగించిన ఈ రెండు పార్టీలు భద్రాచలం నియోజకవర్గంకు కంచుకోటగా ఉన్నాయి..ఒక సారి కాంగ్రెస్, ఒక సారి సీపీఎం పార్టీ హోరాహోరీ పోరులో విజయం సాధించిన సంగతి తెలిసింది. అయితే భద్రాచలంలో బీఆర్ఎస్ పార్టీ మూడవ సారి బరిలో నిలవబోతుంది.. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన తెల్లం వెంకట్రావ్ 12వేలకు పైగ ఓట్ల తేడాతో పరాజయం పాలైయ్యారు. ఇటీవలే బీఆర్ఎస్ ఇంచార్జ్ గా ఉన్న తెల్లం వెంక్రటావ్ ఖమ్మం మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ తరువాత ఏం జరిగిందో ఏమో సీఎం కేసీఆర్ ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిపోయారు. అనంతరం భద్రాచలం టిక్కెట్ ను సీఎం కేసీఆర్ ప్రకటించడమే కాకుండా ఆదివారం బిఫామ్ ను కూడా అందించారు. దీంతో భద్రాచలం బీఆర్ఎస్ అభ్యర్థిగా తెల్లం వెంకట్రావ్ బరిలో నిలవనున్నారు.

## 2018 ఎన్నికల్లో ఇంచార్జ్ గా బాలసాని

భద్రాచలం నియోజకవర్గంలో 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తెల్లం వెంకట్రావ్ బరిలో నిలవగా ఎన్నికల ఇంచార్జ్ గా ఎమ్మెల్సీగా పనిచేస్తున్న బాలసాని లక్ష్మినారాయణను ఇంచార్జ్ గా నియమించారు. భద్రాచలం నియోజకవర్గంలోని వెంకటాపురం



మండలానికి చెందిన బాలసానిని స్థానికుడిగా గుర్తించి ఆయన్ను ఇంచార్జ్ గా నియమించారు. అప్పటి నుంచి పార్టీ గెలుపు కోసం, పార్టీ బలోపేతం కోసం తమ వంతు ప్రయత్నం చేశారు. చివరి ఆరు నెలల వరకు కూడా బాలసాని లక్ష్మినారాయణ ఎన్నికల ఇంచార్జ్ గా పనిచేశారు. ఆ తరువాత

### బాలసానిని తప్పుబట్టిన వెంకట్రావ్

దశాబ్దాల కాలం నుండి పాతుకుపోయిన బాలసాని వర్గం, కాంగ్రెస్ లో చేరి మరల వెంటనే గులాబీ గూటికి చేరిన తెల్లం వెంకటరావును వ్యతిరేకించారు. ఈ వ్యతిరేకతను జీర్ణించుకోలేని తెల్లం ఉన్నత సామాజిక వర్గం పంచన చేరాడు. ఆది నుండి పార్టీ నిర్మాణం కోసం, ఉనికి కోసం అహర్నిశలు కృషిచేసిన బాలసాని వర్గీయులను తప్పు పట్టినట్లు తెలుస్తుంది. గడిచిన ఎన్నికల్లో బాలసాని తన ఓటమికి కారణం అయ్యాడనే అనుమానంతో పార్టీ అధిష్టానం ముందు మాజీ ఎమ్మెల్సీ ని తప్పుడు మనిషిగా చిత్రీకరించినట్లు విశ్వసనీయ సమాచారం. అట్టి విషయాలను దృష్టిలో పెట్టుకోకుండా ఆయన వర్గీయులు పలుమార్లు అధిష్టానం పిలుపుమేరకు అనేక కార్యక్రమాల్లో, సమావేశాల్లో పాల్గొన్నట్లు చెబుతున్నారు. అయినప్పటికీ కావాలనే ఆయన వర్గీయులను వ్యతిరేకిస్తూ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని చెప్పవచ్చు. గోడమీద పిల్లి వలె అవకాశాన్ని బట్టి రంగులు మార్చిన వ్యక్తిని వ్యతిరేకించినప్పటికీ అధిష్టానం నిర్ణయాన్ని తప్పు పట్టకుండా జెండా మోసిన వ్యక్తులను బదనం చేసే విధంగా వెంకట్రావు నడుచుకోవడాన్ని పలువురు తప్పు పడుతున్నారు.

### బీఆర్ఎస్ ఎన్నికల ఇంచార్జ్ గా తాతామధు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొంత మంది నాయకులను ఆయా నియోజకవర్గాలకు ఎన్నికల ఇంచార్జ్ లుగా నియమించారు. అందులో భాగంగానే మధిరకు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, వైరా నామ నాగేశ్వరరావు, సత్తుపల్లికి రాజ్యసభ సభ్యులు పార్థసారథిరెడ్డి, ఇల్లెందుకు రాజ్యసభ సభ్యులు గాయత్రి రవి, భద్రాచలంకు ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షుడు తాతామధు లను ఇంచార్జ్ లను నియమించారు. అశ్వరావుపేట, పినపాక, ఖమ్మం, పాలేరుకు ఇంచార్జ్ లను నియమించలేదు. దీంతో ఇంచార్జ్ లు ఆయా నియోజకవర్గంలో ముమ్మరంగా పర్యటిస్తున్నారు. అయితే తాతామధు ఇంచార్జ్ గా తెల్లం వెంకట్రావ్ ను వెంట వేసుకుని నియోజకవర్గం మొత్తం చుట్టేస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలో ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ ఇచ్చిన పరిస్థితి కూడా చూశాం. చర్ల మండలానికి చెందిన ప్రజాప్రతినిధులందర్ని బీఆర్ఎస్ పార్టీలో చేర్పించడంలో తాతామధు కీలక పాత్ర పోషించారు.

### తాతామధు రాకతో పార్టీలో వర్గపోరు

పార్టీ కోసం కష్టపడి పనిచేసి బలోపేతం చేసిన స్థానికుడైన బాలసాని లక్ష్మినారాయణను కాదని ఆరు నెలల ముందు ఖమ్మం జిల్లాకు చెందిన పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతామధును భద్రాచలం ఇంచార్జ్ గా నియమించడంతో భద్రాచలం బీఆర్ఎస్ లో వర్గపోరు షూరు అయ్యింది.. నిశబ్దవాతావరణంలో ఉన్న బాలసాని వర్గీయులందరు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. కాగా బాలసాని తమ వర్గపోరు ఒక్కసారిగా బహిర్గతం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి, ఎందుకు రాజీనామా చేస్తున్నానో సీఎం కేసీఆర్ కు, మంత్రి కేటీఆర్ కు ముందే చెప్పానని చెప్పడం వెనకాల ఆయన ఆవేదన అర్థమైంది. దీంతో బాలసాని రాజీనామాతో భద్రాచలం నియోజకవర్గంలో వర్గపోరు భగ్గుమంది.. బాలసాని వర్గీయులందరు మూడు అడుగులు ముందుకు..ఏడు అడుగులు వెనక్కి వేస్తూ బీఆర్ఎస్ లో కొనసాగుతున్నారు. వారు కూడా అతి త్వరలోనే గులాబీ గూటికి గుడ్ బై చెప్పే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

### కోటి రూపాయలతో ఓ లీడర్ బంఫర్ ఆఫర్

వెంకటాపురం మండల కేంద్రంలో మంత్రి దయతో తన వ్యాపారాలను కొనసాగిస్తూ కోట్లకు పడగలెత్తాడనే ఆరోపణలు ఉన్న ఓ లీడర్ ఈ మధ్యకాలంలో భద్రాచలం కేంద్రంగా జరిగిన ఓ సమావేశంలో ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి అభ్యర్థి గెలుపు కోసం కోటి రూపాయలు ఖర్చు చేస్తానని ప్రకటించినట్లు విశ్వసనీయ సమాచారం. కాసుల కోసం మొదటి నుండి కష్టించిన వ్యక్తులను విస్మరిస్తే ఎన్నికల్లో భారీగా మూల్యం చెల్లించాల్సిన అవసరాన్ని అధికార పార్టీ రుచి చూస్తుందని మేధావులు తెలుపుతున్నారు. పార్టీ నిర్మాణం కోసం అహర్నిశలు కృషి చేసిన వారిని దూరం పెట్టడం సరికాదని చెప్పాలి.

### క్యాడర్ లేని లీడర్లు

ప్రస్తుతం భద్రాచలం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీకి క్యాడర్ లేని లీడర్లు అన్న చందంగా తయారైనట్లు పలువురు గుసగుసలాడుతున్నారు. పార్టీని నడిపించి సరైన నాయకుడు కనిపించడం లేదని వాపోతున్నారు. అతి తక్కువ సమయంలో వర్గ పోరు వచ్చినప్పటికీ, కిరీటం ధరించాలని చూసే అభ్యర్థి ఒక సామాజిక వర్గానికే ప్రాధాన్యత కల్పించే విధంగా ప్రవర్తించడాన్ని కొందరు తప్పు పడుతున్నారు. ఆ వ్యక్తి గడిచిన కాలంలో ఏ ఒక్కసారి కూడా రోడ్డు మీదకు వచ్చి ఎటువంటి కార్యక్రమాన్ని నిర్వహించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం అతని వెంట నడిచే వ్యక్తులు ఓటర్ ను చైతన్యం చేసే మేధావులు కాదని, వారితో ప్రయాణిస్తే ప్రయత్నం తప్ప ఫలితం శూన్యమనే సంకేతాన్ని ఇస్తున్నారు. ఎన్నికలకు తక్కువ సమయం ఉన్నందున పోటీ చేసే అభ్యర్థి సమయస్ఫూర్తిగా వ్యవహరించకపోతే మరొకసారి భంగపడే అవకాశం ఉంది.. అందుకే బీఆర్ఎస్ పార్టీ మెలుకోకపోతే నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.. చూద్దాం.. రాబోయే రోజుల్లో ఏం జరగబోతుందో..?